క్లుప్తంగా

ఇంటి మధ్యలో వేపచెట్టు !


ఇంటి మధ్యలో ఉన్న చెట్టు

గిద్దలూరు రూరల్: ప్రతి ఒక్కరూ వారి ఇంటి ముందు ఒక మొక్క నాటి పర్యావరణాన్ని పరిరక్షించడంలో భాగస్వాములు కావాలని ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుంటుంది. కానీ దాన్ని ఆచరించేవారు కొందరే. పట్టణంలోని పాతాళనాగేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఓ వ్యక్తి తన ఇంటి నిర్మాణానికి చెట్టు అడ్డం వచ్చినప్పటికీ చెట్టును తొలగించకుండా ఇంట్లోకి కలుపుకుని చెట్టు చుట్టూ రంధ్రం విడిచి పెట్టి మరీ స్లాబ్ వేసి చెట్టును కాపాడాడు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందాం

గిద్దలూరు రూరల్: ఉద్యోగ, కార్మిక సమస్యలపై పోరాడే పీడీఎఫ్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందామని సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పి.బాబుల్‌రెడ్డి, పట్టభద్రులుగా పోటీచేస్తున్న మీగడ వెంకటేశ్వరరెడ్డిల గెలుపునకు కృషి చేద్దామని ఆయన కోరారు. ఉపాధ్యాయ కార్మికుల సమస్యలను పరిష్కారం కోసం వారిని గెలిపించుకోవాలన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


క్రీడలను ప్రారంభిస్తున్న డాక్టర్ షేక్.నాయబ్ రసూల్

రాచర్ల: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని కృష్ణంశెట్టిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ షేక్.నాయబ్ రసూల్ అన్నారు. స్థానిక మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా కోఆర్డినేటర్ కమల్ సా ఆదేశాల మేరకు గిద్దలూరు వాలంటీర్ మూల వెంకట వినీత్‌కుమార్ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ షేక్.నాయబ్ రసూల్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. క్రీడల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.సుధాకర్, పీఈటీ ఉపాధ్యాయుడు రాములు, ఉపాధ్యాయులు రామారావు, రఘురామయ్య, హ్యూమన్ రైట్స్ షేక్.ఖాజా, సలీమ్, అబ్దుల్ రహిమాన్, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో స్వామి వారి గ్రామోత్సవం

గిద్దలూరు రూరల్: మహాశివరాత్రి పండుగ ముగింపు సందర్భంగా పట్టణంలోని పాతాళ నాగేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి పార్వతీ దేవి, గంగాదేవిలతో కొలువుదీరిన స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో సోమవారం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శివ పార్వతుల అలంకరణలో నృత్యకళాకారులు స్వామి వారి వాహనం వెంట ప్రత్యేక నృత్యాలను ప్రదర్శించారు. స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకస్వాములు అనిల్‌శాస్త్రి, ఆలయ కమిటీ సభ్యులు శివాపురం ఆంజనేయులు, గర్రె శ్రీనాథ్, నరేంద్ర, దమ్మాల జనార్దన్, శ్రీకాంత్‌రెడ్డి, మోహన్‌రావు, కౌన్సిలర్ బాలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


గ్రామోత్సవం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వైద్య సేవలు.. మరింత చేరువగా..

- పశ్చిమ ప్రకాశంలో 5 అర్బన్ హెల్త్ సెంటర్లు
- మార్కాపురంలో 3, గిద్దలూరులో 2 ఏర్పాటు
- అందుబాటులో 61 రకాల పరీక్షలు
- రోజుకు 60 నుంచి 70 ఓపీలు



అర్బన్ హెల్త్ సెంటర్

మార్కాపురం: వైద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. టీడీపీ హయాంలో వైద్య రంగం పూర్తిగా నిర్వీర్యమైంది. వైద్యులు, మందుల కొరతతో పేదల ప్రాణాలు గాల్లో కలిసి పోయాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడులో వైద్యశాలల అభివృద్ధి, డాక్టర్ల నియామకానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో రూ.కోటి వ్యయంతో అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశారు. అన్ని రకాల పరీక్షలు చేసేందుకు ఆధునిక వైద్య పరికరాలతో పాటు మందుల కొరత లేకుండా చూస్తున్నారు. దీంతో పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతుండడంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

పశ్చిమ ప్రకాశంలో ఇలా

పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం గిద్దలూరులలో 5 అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఇందులో మార్కాపురంలో 3, గిద్దలూరులో 2 అర్బన్ సెంటర్‌లను ఏర్పాటు చేశారు. పట్టణ నడిబొడ్డున ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో, పూల సుబ్బయ్య కాలనీ జవహర్‌నగర్ కాలనీల్లో దాదాపు ఒక్కొక్కటి రూ.కోటి వ్యయంతో ఏర్పాటయ్యాయి. దీని వల్ల ప్రజలకు వైద్య సేవలు ఇంటి ముంగిటకే వచ్చాయి. ఏ ప్రాంతం వారు ఆ ప్రాంతంలో వైద్యశాలకు వెళ్లి డాక్టర్ల సేవలు పొందుతున్నారు. ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ సెంటర్‌కు ఎస్టేట్, ఏకలవ్యకాలనీ, డ్రైవర్స్ కాలనీ, దొడ్డవారి బజార్, రేడియోస్టేషన్ తదితర ప్రాంతాల్లో నివసించే సుమారు 5వేల మంది ప్రజలకు ఉపయోగంగా ఉంది. పీఎస్ కాలనీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌కు పీఎస్ కాలనీ, బాపూజీ కాలనీ, ఎస్సీ, బీసీ కాలనీ, భగత్‌సింగ్ కాలనీ, కొండారెడ్డి కాలనీ, ఇందిరమ్మ కాలనీ, చెన్నరాయుడు పల్లి ప్రాంతాల ప్రజలు జవహర్‌నగర్ కాలనీలో హెల్త్ సెంటర్‌కు, టీచర్స్ కాలనీ, జేఎన్ కాలనీ, సాయి నగర్ తదితర ప్రాంతాల ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారు.

పరీక్షలు ఇలా

అర్బన్ హెల్త్ సెంటర్‌లలో 61 రకాల వైద్య పరీక్షలు అందనున్నాయి. ఇందులో సుగర్, కిడ్నీ, లివర్, మలేరియా, డెంగీ, వైరల్, రక్తకణాలు, హిమోగ్లోబిన్, కామెర్లు, సోడియం పొటషియం, సిరమ్రియాటిన్, యూరిక్ యాసిడ్, కోలస్ట్రాల్, హెచ్‌డీఎల్, ఎల్‌డీఎల్ తదితర ప్రధాన పరీక్షలను నిర్వహిస్తారు. బీపీ, సుగర్‌తో పాటు కుక్క, పాము కాటులకు కూడా మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రతి బుధ, శనివారాల్లో చిన్నారులకు వ్యాక్సినేషన్ చేస్తారు. రోజుకు 60 నుంచి 70 పెషేంట్లు సేవలు పొందుతున్నారు. అర్బన్ పీహెచ్‌సీలో డాక్టర్‌తో పాటు ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, అటెండర్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఉన్నారు.


పరీక్ష చేస్తున్న డాక్టర్ రాజశేఖర్

సేవలు ఉపయోగించుకోండి



పట్టణ అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్య సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలి. గత ఏడాది ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సుమారు రూ.కోటి మంజూరు చేయడంతో పట్టణ నడిబొడ్డున ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించాం. డాక్టర్‌తో పాటు వైద్య సిబ్బంది ఉన్నారు.

– కేపీ నాగార్జునరెడ్డి, ఎమ్మెల్యే

61 రకాల పరీక్షలు



అర్బన్ హెల్త్ సెంటర్‌లలో 61 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రజలు డాక్టర్ల సేవలను ఉపయోగించుకోండి. ఎక్కడా మందుల కొరత లేదు. మంచి వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు. పట్టణ ప్రజలు వీరి సేవలను పొందొచ్చు. సాధారణ జబ్బులతో పాటు సుగర్, బీపీ కూడా మందులు ఇస్తారు.

– డాక్టర్ రాహుల్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ,మార్కాపురం

మంచి సేవలు అందుతున్నాయి



పట్టణ అర్బన్ హెల్త్ సెంటర్‌లలో డాక్టర్, సిబ్బంది బాగా చూస్తున్నారు. మందులు కూడా ఉచితగా ఇస్తున్నారు. అన్ని రకాల పరీక్షలు చేస్తున్నారు. బీపీ, సుగర్‌కు మందులు ఇస్తున్నారు.

– పద్మావతి, మార్కాపురం పట్టణం

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలిరూరల్: తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల నుంచి పోటీ చేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కోరారు. సోమవారం పొదిలి పార్టీ కార్యాలయంలో మండల, పట్టణ, గ్రామ, వార్డు కమిటీ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించేందుకు ముఖ్య నాయకులు బాధ్యత తీసుకోవాలన్నారు. వార్డుల వారీగా ఎంత మంది ఓటు హక్కు కలిగిన వారు ఉన్నారో జాబితా తీసుకోని ఓట్లు అభ్యర్థించడం సులభంగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. సమావేశంలో మండల, పట్టణ పార్టీ కన్వీనర్లు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, ఎస్‌కే నూర్జహాన్‌బేగం, రాష్ట్ర కార్యదర్శి కసిరెడ్డి రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, మండల పార్టీ మాజీ కన్వీనర్లు జి.శ్రీనివాసులు, గుజ్జుల సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ కె.నరసింహారావు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు పులిగోర్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు సుభిక్షంగా ఉండాలి


అన్నవరంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కేపీ

- మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలిరూరల్: సకాలంలో వర్షాలు కురిసి చేతి నిండా పనిదొరికి పాడి పంటలతో, పిల్లపాపలతో అందరూ సుభిక్షంగా ఉండాలని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆకాంక్షించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పొదిలి మండలంలోని అన్నవరంలో ఆదివారం రాత్రి జరిగిన రామలింగేశ్వర స్వామి తిరునాళ్లలో ఆయన పాల్గొన్నారు. రామలింగేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తిరునాళ్లలో విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసినా ఎన్నికల కోడ్ కారణంగా ప్రభల మీదకు ఎక్కలేదు. కుల, మతాలకు అతీతంగా అందరూ ప్రశాంత వాతావరణంలో పండుగ చేసుకోవడం మంచిదన్నారు. పార్టీ మండల కన్వీనర్ దుగ్గెంపూడి శ్రీనివాసులురెడ్డి, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, మాదాలవారిపాలెం సొసైటీ అధ్యక్షుడు కొత్తపుల్లి బ్రహ్మారెడ్డి, గూడూరి వినోద్, అంబవరపు నారాయణరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ సర్వేకు రైతులు సహకరించాలి

తాళ్లూరు: రైతులు భూ సమగ్ర సర్వేకు సహకరించాలని డిప్యూటీ తహసీల్దార్ ఇమ్మానియేలు రాజు అన్నారు. స్థానిక సచివాలయంలో సోమవారం తాత్కాలిక సర్పంచి షేక్ మహబూబ్‌బీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రైతులు అందుబాటులో ఉండాలని కోరారు. సర్వేయర్ అవుల శ్రీనివాసరావు, ఈఓఆర్డీ ఎన్‌యూ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

21న విశ్రాంత ఉద్యోగుల సంఘ సర్వసభ్య సమావేశం

కొమరోలు: మండల యూనిట్ విశ్రాంత ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశాన్ని 21వ తేదీ మంగళవారం నిర్వహిస్తున్నట్లుగా జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు కొమరోలులోని విశ్రాంత ఉద్యోగ సంఘ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్నట్లుగా తెలిపారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బి.వి.సుబ్బారావు హాజరవుతారన్నారు. విశ్రాంత ఉద్యోగులు ఈ సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.

తాత్కాలిక సర్పంచ్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న షేక్ మహబూబ్‌బి

తాళ్లూరు: విఠలాపురం తాత్కాలిక సర్పంచిగా షేక్ మహబూబ్‌బీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సర్పంచ్ మారం ఇంద్రసేనా రెడ్డి 3నెలల పాటు సస్పెండ్ కావటంతో ఆయన స్థానంలో ఉప సర్పంచిగా ఉన్న ఆమెకు బాధ్యతలు అప్పగించారు. ఈఓఆర్డీ ఎన్‌యూ ప్రసన్నకుమార్, గ్రామ కార్యదర్శి నూరుల్లాను మహబూబ్‌బీ బాధ్యతలు అప్పగించి రికార్డుల్లో సంతకాలు చేయించారు. కో ఆప్షన్ మెంబర్ కరిముల్లా, మల్కాపురం సర్పంచి వలి, షేక్ బుడే, ముండ్లమూరు మస్తాన్, బుడే సాహెబ్, మస్తాన్, కాశిం వలి, గోళ్లపాటి చిన ఏసు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ఉద్యమం


వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఎంపీజే నాయకులు

మార్కాపురం టౌన్: ఎంపీజే ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మాదకద్రవ్యాల వాడకంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఉద్యమాన్ని చేస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రజాక్ తెలిపారు. ఇస్లాం పేటలోని ఎంపీజే కార్యాలయంలో సోమవారం సాయంత్రం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ప్రభుత్వం యువత మేలుకో- భవితను మల్చుకో- డ్రగ్స్‌ను వదులుకో కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాశీం, మెహబూబ్‌ఖాన్, మీరావలీ, రసూల్, జహీర్ పాల్గొన్నారు.

మహిళ నిరాహార దీక్ష


నిరాహార దీక్షలో అంజమ్మ

మార్కాపురం: న్యాయం చేయాలని కోరుతూ మార్కాపురం రైల్వే బ్రిడ్జి కింద నివాసం ఉంటున్న బండారు అంజమ్మ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా నిరాహార దీక్ష చేపట్టింది. రైల్వేస్టేషన్ దగ్గర నివాసం ఉండే ఒక వ్యక్తి తనపై దాడి చేసి స్పృహ కోల్పోయిన వెంటనే వేలిముద్రలు సేకరించి తన పొలాన్ని అమ్మినట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించాడని, తన పొలాన్ని తనకు ఇప్పించాలని అంజమ్మ కోరింది. అధికారులు స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది. న్యాయం జరిగే వరకు దీక్ష చేస్తానని తెలిపింది.

ఉత్తమ వైద్యునికి సన్మానం


వైద్యాధికారి ప్రవీణ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కురిచేడు: జిల్లా స్థాయిలో ఉత్తమ వైద్యుడుగా అవార్డు అందుకున్న స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి పి. ప్రవీణ్‌ను ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. అతి తక్కువ కాలంలో జిల్లా స్థాయిలో అవార్డు పొందటమే కాకుండా ఉత్తమసేవలందించి వైద్యశాలకు జాతీయ స్థాయిలో అవార్డు దక్కేలా పనిచేసిన వైద్యాధికారిని, సిబ్బందిని కొనియాడారు. ఏపీటీఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజారహంతుల్లా, అధ్యక్షులు ఎస్.వి.ఎల్. సుబ్బారావు పాల్గొన్నారు.

24న వెలుగొండలో వేలంపాట

కొనకనమిట్ల: వెలుగొండస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పలు రకాల వస్తువులు విక్రయించుకునేందుకు ఈ నెల 24న దేవస్థానంలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సాని కొమ్ము తిరుపతిరెడ్డి తెలిపారు. మార్చి నెల 7వ తేదీ నుంచి 19వ తేదీ వరకు పూజా ద్రవ్యాలు, కొబ్బరికాయలు అమ్ముకునేందుకు, కొబ్బరిచిప్పలు పోగు చేసుకొనేందుకు, బ్రహ్మోత్సవాలు ముందు రోజు నుంచి మళ్లీ వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాలు ముందు వరకు తలనీలాలు పోగు చేసుకునేందుకు వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించే వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.10 వేల ధరావత్తు చెల్లించాలని తెలిపారు. వేలం పూర్తయిన వెంటనే హక్కుదారులు పూర్తి మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 8099949996 నంబర్‌ను సంప్రదించాలని ఈఓ చెన్నకేశవరెడ్డి కోరారు.

వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు


కళ్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

తర్లుపాడు: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా తర్లుపాడు భద్రకాళి సమేత వీరభద్రస్వామికి సోమవారం ప్రాతకాల పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు చేశారు. అర్చకులు పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో రుద్రాహోమాన్ని నిర్వహించారు. ధర్మకర్త నేరేళ్ల సాంబశివరావు ఆధ్వర్యంలో స్వామి కల్యాణం నిర్వహించారు. ఈఓ చెన్నకేశవ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

సార్వభౌమునిగా మహేశ్వరుడు

మార్కాపురం టౌన్: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శివాలయంలో స్వామి సోమవారం సార్వభౌమ అలంకారంగా భక్తులకు దర్శనమిచ్చారు. స్వామికి ఉదయం రుద్రాభిషేకం, అమ్మవారికి అర్చన నిర్వహించారు. నాలుగు మాడ వీధుల్లో స్వామి ఉరేగింపులో భక్తులు పాల్గొన్నారు. చైర్మన్ వి.కేశవరావు, ఈఓ చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు.


సార్వభౌమునిగా పార్వతి పరమేశ్వరుల దర్శనం

విద్యార్థి దశలోనే చట్టాలు తెలుసుకోవాలి


విద్యార్థుల ఆహారం పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జ్ ప్రసాద్

దర్శి: విద్యార్థి దశలోనే చట్టాలు తెలుసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జ్ జీఎల్‌వీ ప్రసాద్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వం ఎస్సీ కళాశాల బాయిస్ హాస్టల్‌ను సోమవారం తనిఖీ చేశారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సులో చట్టాలపై అవగాహన కల్పించారు. చిన్న తనం నుంచి నేర్చుకునే మంచి అలవాట్లే పెద్దయ్యాక ఉన్నత స్థాయికి తీసుకుని వెళతాయన్నారు. న్యాయవాది సుబ్బారెడ్డి, సంఘసేవకులు జీవీరత్నం తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తాళ్లూరు: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.వై కీర్తి తెలిపారు. పూర్తి సమాచారంతో పాల్గొనాలని కోరారు.

చోరీపై కేసు నమోదు


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

ముండ్లమూరు: మండలంలోని ఉమామహేశ్వరపురంలో అమరా వెంకటేశ్వర్లు ఇంట్లో శనివారం రాత్రి జరిగిన చోరీపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.సంపత్‌కుమార్ తెలిపారు. చోరీ జరిగిన ఇంటిని ఒంగోలు క్లూస్ టీం సిబ్బంది పరిశీలించి, వేలి ముద్రలు సేకరించారు.

23 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మార్కాపురం టౌన్: పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ఆమలక లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ అధ్యక్షుడు డాక్టర్ డీవీ కృష్ణారెడ్డి తెలిపారు. శ్రీహరేరామనామ 60వ సప్తాహ బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 నుంచి మార్చి 1వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 23న ఉత్సవ ప్రారంభ స్నపనం(అంకురార్పణ), లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం, 24న సామూహిక లక్ష్మీపూజ(కుంకుమార్చన), 25న అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, ఆమలక లక్ష్మీ నారాయణ స్వామి కల్యాణం, గరుడోత్సవం, 26న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణం, 27న సీతారామ కల్యాణం, 28న శ్రీరామ పట్టాభిషేకం, సాయంత్రం 6గంటలకు రథోత్సవం, మార్చి 1న బ్రహ్మోత్సవ పూర్ణాహుతి, చక్రస్నానం, శ్రీపుష్పయాగం, సప్తావరణం, ఏకాంత సేవ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

సమన్వయంతో పార్టీ అభివృద్ధికి కృషి


మద్దిశెట్టి శ్రీధర్‌ను సన్మానిస్తున్న యాదిక

తాళ్లూరు: సమన్వయంతో పార్టీ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్దిశెట్టి శ్రీధర్ కోరారు. తాళ్లూరు మండల సచివాలయాల జేసీఎస్ మండల కన్వీనర్ యాదిక శ్రీనివాస రెడ్డి మంగళవారం మద్దిశెట్టి శ్రీధర్‌ను కలిసి తనను నియమించినందుకు ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిశెట్టి రవీంద్ర, మద్దిశెట్టిశ్రీధర్‌లకు కృతజ్ఞతలు తెలుపుతూ సన్మానించారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకట రెడ్డి, సర్పంచ్ పీఎస్ శ్రీకాంత్ రెడ్డి, ఎంపీటీసీ జీఎస్ ప్రభాకర్ రెడ్డి, గుంటి గంగా ఆలయ కమిటీ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, గంగి రెడ్డి పాలెం యలమందా రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి తరఫున ప్రచారం

ముండ్లమూరు: వైఎస్సార్ సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తరఫున వారి అనుచరులు సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ముందుగా ముండ్లమూరులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మారెడ్డిని కలిసి ప్రచార కరపత్రం అందజేశారు. పలు గ్రామాల్లో జాబితాలో పేర్లున్న వారిని కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి గెలిపించాలని కోరారు. నాయకులు ఇన్నమూల వెంకటాద్రి, ఆకుల ఏడుకొండలు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.


ముండ్లమూరులో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి అనుచరులు